క్లుప్తంగా

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు మంగళవారం విచ్చేసిన ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఓ హోటల్ వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కళావేదిక భవనం ప్రారంభం



కళావేదికను ప్రారంభిస్తున్న సాయిరాం దంపతులు

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని పాత పెట్రోల్ బంక్ ఎదురుగా ముత్యాలమ్మ తల్లి అమ్మవారి ప్రాంగణంలో నిర్మించిన ముత్యాలమ్మ తల్లి కళావేదిక భవనాన్ని మంగళవారం మేమున్నాం సేవా సంస్థ అధ్యక్షుడు పచ్చిగుళ్ల సాయిరాం, ఎంపీటీసీ దేవయాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కాగా, జాతర సందర్భంగా తెల్లవారుజాము నుండే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు



ఊర చెరువు సమీపంలో రోడ్డు ఇదే

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం రెవెన్యూ పరిధిలోని కేశవరావుపేట పంచాయతీలో ఊర చెరువు సమీపంలో వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురవుతోందని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సమగ్ర సర్వే చేయించాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ బి.గోపాలరావు స్పందిస్తూ త్వరలో సర్వే నిర్వహిస్తామని, ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని చెప్పారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



ముగింపు సభలో మాట్లాడుతున్న అధికారులు, అతిథులు

శ్రీకాకుళం రూరల్: శిలగాం సింగువలస గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న నైరా కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం మంగళవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉపాధి అధికారి కె.సుధా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ శిబిరాల వల్ల విద్యార్థుల్లో సేవా భావం, ఆత్మ స్థైర్యం పెరుగుతాయన్నారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ బి.రజిని సమీకృత వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అంతకుముందు స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహిస్తూ వయ్యారిభామ మొక్కల నిర్మూలనపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల పరీక్షల షెడ్యూల్ విడుదల



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2024–25 అకడమిక్ సంవత్సరానికి గాను పరీక్షల షెడ్యూల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు మంగళవారం వెల్లడించారు. డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ థియరీ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. 4వ సెమిస్టర్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 15న, 2వ సెమిస్టర్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 26న, 4వ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 26న, 2వ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 15న మొదలవుతాయని వివరించారు. 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ అసెస్మెంట్ ఏప్రిల్ 23 నుంచి 25 వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

పడకేసిన పల్లె ప్రగతి



తుప్పలతో నిండిన జె.ఆర్.పురం ఆర్ఎస్‌కే, వెల్‌నెస్, పాలవెల్లువ భవనాలు



తుప్పపట్టిన జే.ఆర్.పురం-1 రైతు సేవా భవన ఇనుప గంజాలు

- సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణాలకు బ్రేక్
- కూటమి సర్కారు నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులులు
- పెండింగ్ బిల్లులతో కాంట్రాక్టర్ల గగ్గోలు

రణస్థలం: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పాల వెల్లువ కేంద్రాలు వంటి వాటికోసం సరికొత్తగా భవనాల నిర్మాణం చేపట్టింది. ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.21.80లక్షలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు రూ.17.5 లక్షలు, జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు రూ.15.74 లక్షలు చొప్పున నిధులకు అంచనా వేసి మంజూరు చేశారు. ఇందులో చాలా భవనాలు పూర్తికాగా మరి కొన్ని వివిధ దశల్లో ఉన్న సమయంలో ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అసంపూర్ణ భవనాల్లో ఇనుము తుప్పు పట్టి, పిచ్చి మొక్కల మొలిచి శిథిలావస్థ చేరుకుంటున్నాయి.

మందుకు సాగని పనులు

గత ప్రభుత్వంలో భవనాల పనులు శరవేగంగా జరిగాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 99 గ్రామ సచివాలయాలు, 99 రైతు భరోసా కేంద్రాలు, 93 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవనాలు ఉన్నాయి. అందులో 75 వరకు గ్రామ సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా 25 భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లో పనులు చేస్తున్నారు. 53 రైతు సేవా కేంద్రాలు, 63 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఇంకా పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. వీటి నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో ఎక్కడికక్కడే నిలచిపోయాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ సచివాలయం			
మండలం	మంజూరు	నిర్మాణం పూర్తి	అసంపూర్తిగా ఉన్నవి
రణస్థలం	27	20	7
లావేరు	23	16	7
ఎచ్చెర్ల	28	20	8
జి.సిగడాం	21	19	2
రైతు సేవా కేంద్రాలు			
రణస్థలం:	27	08	19
లావేరు	23	10	13
ఎచ్చెర్ల	28	11	17
జి.సిగడాం	21	17	4
ఆరోగ్య కేంద్రాలు			
రణస్థలం:	25	6	19
లావేరు	21	4	17
ఎచ్చెర్ల	26	11	15
జి.సిగడాం	21	11	10

బిల్లులు మంజూరు చేస్తే..



జే.ఆర్.పురం–2లో గ్రామ సచివాలయానికి 70శాతం మాత్రమే నిధులు మంజూరై మిగతా పెండింగ్‌లో ఉన్నాయి. రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, జగనన్న పాలవెల్లువ భవనాలకు సుమారు రూ. 20లక్షలు ఖర్చు చేశాం. ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాలేదు. ఎన్నికల కోడ్ రావడం తదుపరి ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. వడ్డీలకు తెచ్చిన సొమ్ముతో పనులు చేశాం. ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందుల్లో ఉన్నాం.

– రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం వైస్ ఎంపీపీ

పనులు పూర్తిచేయాలి..



పెండింగ్‌లో ఉన్న ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు పనులు ప్రారంభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలి. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందాలంటే పక్కా భవనాలు తప్పక ఉండాలి. అప్పుడే పంచాయతీల ప్రగతి సాధ్యమవుతుంది.

– రెడ్డి విశ్వేశ్వరరావు, పిషిణి సర్పంచ్

ఆదేశాలు వచ్చాయి..

గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం వంటి భవనాల నిర్మాణాలపై కొన్ని రోజుల క్రితమే ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో కట్టిన వారే పనులు చేసినా పరవాలేదు. ఒకవేళ వారు చేయమంటే కొత్త వారికి ఇచ్చి పనులు చేయిస్తాం. ఏదైనా ఇరువురి ఆమోదంతోనే పనులు చేయాల్సి ఉంటుంది.

– సనపల శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈఈ

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు

- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎచ్చెర్ల మండల పార్టీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలను తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని పార్టీ కార్యాలయంలో కిరణ్‌ను ఎచ్చెర్ల మండల వైఎస్సార్ సీపీ నూతన కమిటీ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమించి పనిచేసేవారికి వైఎస్సార్ సీపీలో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఎన్నికలు ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమల్లో విఫలమైందన్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా తల్లికి వందనం డబ్బులు వేయలేదన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు కాలేదని చెప్పారు. మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లు దాటిన బీసీలకు సామాజిక పింఛన్లు వంటి పథకాలు గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లటం లక్ష్యంగా మండల కమిటీలు కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాంరెడ్డి, కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు, గర్భిణులు, బాలింతలలో పౌష్టికాహార లోపాన్ని తగ్గించాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి అన్నారు. నగరంలోని కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలో 15వ వార్డు దూదివారిసందు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మి, ఎంఎస్‌కే హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, విజయ, అరుణ, నీలవేణి, ఇందిర పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పురోహితులు పన్నాల నర్సింహమూర్తి ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంధవరపు వెంకటరమణ, లక్ష్మీ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు చందనోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో హజరత్ బంగేషా హుస్సేనీలో ఈ నెల 9న చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు ముతవల్లి ఎంఏ రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలను నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ముస్లింలంతా పాల్గొనాలని కోరారు.

రక్తదానం అభినందనీయం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు సందర్భంగా అభిమానులు మంగళవారం రణస్థలంలోని సూర్య ఆసుపత్రి ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 18 మంది యువకులు రక్తదానం చేసి న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఇ.తిరుపతిరాజు, వైద్యులు యశ్వంత్, అభిమానులు పాల్గొన్నారు.

రీసర్వే సద్వినియోగం చేసుకోండి

ఎచ్చెర్ల: భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లావేరు తహశీల్దార్ వై.జోగారావు కోరారు. లావేరు మండలం వెంకటాపురంలో సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు అధ్యక్షతన రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ తిరుపతిరావు, మండల సర్వేయర్ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మడ్డి రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కమనీయం..ఆదిత్యుని కల్యాణం



సప్తాశ్వ, గజవాహనాల్లో కల్యాణమూర్తుల తిరువీధి ఉత్సవం

అరసవల్లి: కన్నుల పండువగా కర్మసాక్షి పరిణయం జరిగింది. ఇందుకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ అనివెట్టి మండపం వేదికగా మారింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో సూర్యనారాయణుడు కల్యాణమూర్తులుగా అలంకృతులై చైత్రశుద్ధ ఏకాదశి మంగళవారం రాత్రి వివాహ వేడుక పరిపూర్ణమయ్యింది. కల్యాణ సేవలో కూర్చున్న భక్త దంపతుల నడుమ అర్చక స్వాముల వేదమంత్రోచ్చారణలు, మంగళ ధ్వనుల మధ్య ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో రుగ్వేదం ప్రకారం ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. అంతకుముందు కల్యాణమూర్తులను వెండి సప్తాశ్వరథ వాహనం, గజవాహనంపై ముగ్గురు దేవేరుల ఉత్సవమూర్తులు తిరువీధి నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవాచనం, యజ్ఞోపవేత ధారణ, కన్యాదానం, సుమూహూర్తం, తలంబ్రాలు తర్వాత మాంగళ్యసూత్ర ధారణ, బ్రహ్మముళ్లు, ప్రవేశ హోమాలు.. తదితర ప్రక్రియలతో కల్యాణ క్రతువును ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ, ఇప్పిలి క్షేమేంద్ర శర్మలు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు శంకరశర్మ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో వై.భద్రాజీ ఏర్పాట్లు చేశారు. కాగా, వార్షిక కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆలయ అనివెట్టి మండపాన్ని పుష్పాలంకరణలతో తీర్చిదిద్దారు.ఆలయ రాజగోపురం, మహామండపాలు, విమాన గోపుర శిఖరమంతా విద్యుత్ అలంకరణలతో మెరిసిపోయాయి. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఉంగటి రమణమూర్తి, ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్లు శోభనాద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



తాళిబొట్లను చూపిస్తున్న ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ

వైభవంగా గ్రామదేవత ఉత్సవం



గార మండలం అంపోలులో మంగళవారం గ్రామదేవత ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఇంటికో ఘటం చొప్పున మంగళవాయిద్యాల నడుమ మహిళలు బయలుదేరారు. దిగువ వీధి, పెద్ద వీధి తదితర వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు.

– గార

సీతారాముల రథోత్సవం



పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామచంద్రమూర్తి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఊరేగింపు చేపట్టారు. అనంతరం కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ సర్వేశ్వరరావు, కోదండ రామాలయ భక్తబృందం పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

వర్షంతో ఉపశమనం



ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోయిన నగరవాసులు మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. సుమారు గంట సేపు వాన కురవడంతో వాహన చోదకులు కాస్త ఇబ్బందులు పడినా.. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

మహిళా సంఘాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అధిక ఆదాయ అవకాశాలు కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధి యూనిట్ల స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. స్త్రీనిధి ఉన్నతి పథకాలు, నాబార్డ్ ప్రాజెక్టులను జిల్లాలో అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, లాభదాయక పంటల సాగు, సేవారంగాలు, ఉత్పత్తి రంగాల్లో యూనిట్ల ఏర్పాటుతో మహిళలకు అధిక ఆదాయ అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరవేయాలని సూచించారు. డీఆర్‌డీఏ ఏపీఎంలు తమ పరిధిలోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు ఇది గొప్ప అవకాశమని మంత్రి చెప్పారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్‌కు, నాబార్డ్ ప్రాజెక్టుల ఆధారంగా జిల్లాకు అనువైన ప్రణాళికలు రూపొందించి సమర్పించాలని సూచించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ ప్రస్తుతం అమలులో ఉన్న జీవనోపాధి కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, సీడాప్ మేనేజర్ రమణ, చింతాడ రామ్మోహన్ రావు, డీపీఎం మోహనరావు, ఎచ్చెర్ల ఏసీ రవికుమార్, నరసన్నపేట ఏసీ కొండలరావు, ఆయా మండల ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

జనాలను రోడ్డున పడేయడం ఆపండి

- వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం



గేదెల పురుషోత్తం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వానికి ముఖ్యంగా శ్రీకాకుళం టీడీపీ నేతలకు జనాలను రోడ్డున పడేయం అలవాటుగా మారిపోయిందని, ప్రత్యామ్నాయ వసతులు చూపకముందే పేదల బతుకులను రోడ్డుకు ఈడ్చేయడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం హితవుపలికారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014లో కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం కోడి రామ్మూర్తి స్టేడియాన్నిపునర్నిర్మిస్తామని కూలదోసేసిందని, ఇప్పటికీ పునర్నిర్మించలేకపోయిందని గుర్తు చేశారు. తాజాగా పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్‌ను కూలదోసి కొత్తగా ప్రైవేట్ పబ్లిక్, ప్రభుత్వ భాగస్వామ్యంతో షాపులు నిర్మించడానికి సిద్ధపడుతున్నారని, దీనివల్ల నగరంలో చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రూ.3వేలు ఉన్న అద్దె రూ.30వేలు దాటుతుందని చెప్పారు. రథసప్తమి సందర్భంగా అరసవల్లిని అభివృద్ధి చేస్తామని స్థానికులను, వ్యాపారులను వెళ్లగొట్టి ఇప్పటికీ వారికి ప్రత్యామ్నాయం చూపలేదని ఆరోపించారు. ఇప్పుడు పెద్ద మార్కెట్ వ్యాపారులకు కూడా మరోచోటు చూపించకుండా వెంటనే షాపులు ఖాళీ చేయాలనడం పాలకుల తెలివి తక్కువ తనానికి నిదర్శనమన్నారు. స్థానిక డీసీసీబీ కాలనీ విస్తరణలో 80 అడుగుల రోడ్డు కోసం విడిచిపెట్టిన స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు అందజేస్తున్న హరిబాబు

రణస్థలం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు అన్నారు. హరిత సొసైటీ సభ్యులు గొర్లె అప్పలనాయుడు తల్లి సత్యవతమ్మ పేరిట పాతర్లపల్లి వెంకటేశ్వర కాలనీలోని రామాలయం ఆవరణలో ఉసిరి, నేరేడు, సపోట, జామ తదితర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అభివృద్ధి సాకుతో విచక్షణారహితంగా చెట్లు నరికేయడం వల్ల భూతాపం పెరిగిపోయి, పర్యావరణానికి తీరని నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రెల్లి సన్యాసప్పలనాయుడు, రెడ్డి సన్యాసిరావు, గొర్లె సూర్యనారాయణ, రామకృష్ణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్వేతగిరిపై ఏకాదశి పూజలు

గార: శాలిహుండం కాళీయ మర్దన వేణుగోపాలస్వామికి కామద ఏకాదశి సందర్భంగా మంగళవారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధు రెడ్డి దంపతులు క్షీరాభిషేకం నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి ఆనంద్ కాశ్యప్ ఆధ్వర్యంలో భక్తులు గోత్ర నామాలతో పూజలు చేయించుకున్నారు.